క్లుప్తంగా

చిన్నారులకు టీకాలు వేయాలి



రుద్రూర్: పొతంగల్ మండలం హంగార్గ ఫారం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో చేపట్టిన టీకాల కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య శనివారం పరిశీలించారు. చిన్నారులందరికీ టీకాలు సకాలంలో వేయాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. టీకాల కార్యక్రమం పూర్తి కాగానే అదే రోజు యూవిన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ నిరంతరం కొనసాగించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి వ్యాక్సిన్, టీకాల జాబితాను పరిశీలించారు. వైద్యాధికారిణితోపాటు మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, హెల్త్ సిబ్బంది నిర్మల, రవి, విజయ, సుహాసిని, ఆశ వర్కర్లు సునీత, సమత, మమత పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



డొంకేశ్వర్(ఆర్మూర్): నాయీ బ్రహ్మణ కులానికి చెందిన బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూర్ ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించడాన్ని హర్షిస్తూ డొంకేశ్వర్ మండల బీజేపీ కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం గాల్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్, బీజేపీ మండల అధ్యక్షుడు సురేందర్, రంజిత్, సాగర్, బాబురావు, నాగరాజు, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో ఆడాలి



బాల్కొండ: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి అన్నారు. యువయూత్ ఆధ్వర్యంలో మెండోరా మండల కేంద్రంలో నిర్వహిస్తున్న బుట్టడి వినోద్ స్మారక కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్‌ను సునీల్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు యువకులు టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు అండగా ఉంటుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి, నాయకులు సుమో రాజేశ్వర్, పడాల గంగారెడ్డి, బద్దం అశోక్, మౌలాన, నరేశ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురికావొద్దు

బాల్కొండ: విద్యార్థులు పరీక్షలంటే భయపడి ఒత్తిడికి గురికావొద్దని ఏఆర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ కార్యదర్శి, సైకాలజిస్ట్ సునీత అన్నారు. మెండోరా మండలం బుస్సాపూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఐడీసీఎస్ ఆధ్వర్యంలో శనివారం బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. జీవననైపుణ్యాలను విద్యార్థులకు వివరించారు. మానసిక ఆరోగ్యపరిస్థితులపై అవగాహన కల్పించారు. ఆడ పిల్లలను చదివించాలన్నారు. కో ఆర్డినేటర్ స్వప్న, స్పెషలిస్టు ఇన్ ఫైనాన్స్ లిటరసీ పుష్ప, ఏవో పద్మ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌వోకు సన్మానం

ఆర్మూర్‌టౌన్: ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్‌ను సీపీఐ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి అరేపల్లి సాయిలు, మౌలానా, మధరి నరేశ్, లక్ష్మి, నర్సయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలపై అవగాహన

మాక్లూర్: మండలంలోని విజయ్ రూరల్ ఇంజినీరింగ్ కళాశాలలో టాస్క్, హిందుస్తాన్ కోకా కోలా సంయుక్తంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. ట్రైనీ అబ్దుల్‌తోపాటు సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు ఎంప్లాయిమెంట్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. ఉద్యోగ సాధనకు కమ్యునికేషన్ స్కిల్స్ అత్యవసరమన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావాలని సూచించారు. ప్రిన్సిపల్ గణేశ్, శ్రీకాంత్‌కుమార్, వాసు, మారుతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘ప్రసవ’ వేదన పట్టదా..?

- వారంలో రెండురోజులే ఆపరేషన్లు
- వైద్యులు లేకపోవడమే కారణం
- డిప్యూటేషన్‌పై వస్తున్న గైనకాలజిస్టు, మత్తు వైద్యురాలు
- బాల్కొండ ప్రభుత్వ ఆస్పత్రిలో ఇబ్బందులు



బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ క్లస్టర్ ఆస్పత్రిలో గర్భిణుల ప్రసవ వేదన ఎవరికీ పట్టదా అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ‘మార్పు’ కార్యక్రమంలో భాగంగా ఇక్కడ గత మూడేళ్లుగా గర్భిణులకు సాధారణ కాన్పులతోపాటు ఆపరేషన్లు చేస్తున్నారు. అయితే పూర్తిస్థాయిలో వైద్యాధికారులు లేకపోవడంతో వారంలో రెండు రోజులు మంగళ, గురువారం మాత్రమే ఆపరేషన్లు చేసే పరిస్థితి ఉంది. దీంతో అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులను ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించాల్సి వస్తోంది. క్లస్టర్ ఆస్పపత్రి వైద్య విధాన పరిషత్‌లోకి మారినప్పటికీ మార్పు కనిపించడం లేదు.వైద్యులు, సిబ్బంది కొరత కారణంగా పూర్తిస్థాయిలో ప్రజలకు సేవలందించడం లేదు.

ఇద్దరూ డిప్యుటేషన్ పైనే..

ఆసుపత్రిలో కాన్పులు చేయాలంటే గైనకాలజిస్టుతోపాటు మత్తు వైద్యులు ఉండాలి. కానీ బాల్కొండ ఆస్పత్రిలో రెండు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. భీమ్‌గల్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పపత్రిలో విధులు నిర్వర్తించే గైనకాలజిస్టుతోపాటు మత్తు డాక్టర్‌కు ఇక్కడికి డిప్యుటేషన్ వేశారు. అదికూడా వారంలో రెండు రోజులు మాత్రమే. పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాల్సిన అవసరం ఉన్నప్పటికీ.. పాలకులు, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య రోజురోజుకూ తగ్గుతున్నది. ఆస్పత్రిలో డిప్యూటీ సివిల్ సర్జన్, దంత వైద్యుడు విధులు నిర్వర్తిస్తుండగా, పిల్లల వైద్యుడు లేడు. స్టాఫ్ నర్సులు కూడా పూర్తి స్థాయిలో లేరు. ఆస్పత్రిలో సిబ్బంది కొరతపై వివరణ కోరేందుకు వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారి డాక్టర్ శివశంకర్‌ను ‘సాక్షి’ పలు మార్లు ఫోనులో సంప్రదించినప్పటికీ ఆయన స్పందించలేదు.

మూడు పీహెచ్‌సీలు

బాల్కొండ ప్రభుత్వ ఆస్పత్రి క్లస్టర్‌లో కిసాన్‌నగర్, పోచంపాడ్, మెండోరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఈ మూడింటిలో నిత్యం వందకు పైనే ఓపీ ఉంటుంది. ఈ నేపథ్యంలో వైద్య సేవలు మెరుగుపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ అటు వైపుగా అడుగులు పడటం లేదు. మెండోరా పీహెచ్‌లోనూ ఇన్‌చార్జి వైద్యాధికారి విధులు నిర్వర్తిస్తున్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలి



నందిపేటలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంతోపాటు నవీపేట మండలం హనుమాన్ ఫారంలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ‘గావ్ చలో అభియాన్’ కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమాన్‌ఫారంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డి మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావాలని, కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావాలనే లక్ష్యంతో కార్యకర్తలు పని చేయాలని సూచించారు. అనంతరం ఇటీవల పదవీ కాలం ముగిసిన పలువురు సర్పంచులను ఆయన సన్మానించారు. గావ్‌చలో అభియాన్ కో ఆర్డినేటర్ సందీప్, నవీపేట, రెంజల్, ఎడపల్లి మండలాల అధ్యక్షులు సరిన్, ఇంద్రకరణ్, గోపికృష్ణ, ఎంపీటీసీ మైస రాధ, నాయకులు శ్రీధర్, వంశీ, రాజేందర్ గౌడ్ పాల్గొన్నారు. నందిపేట్‌లో బీజేపీ శక్తి కేంద్రాల బూత్ అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, యువమోర్చా నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



రెంజల్(బోధన్): తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్, మాను(మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ) నుంచి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న కందకుర్తి యాదవరావును నీలా హైస్కూల్ ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. మాను జాతీయ చైర్మన్ రాధాకిషన్, వీసీ సయ్యద్ ఐనూల్ హసన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి ఎంపికైన యాదవరావు మండలానికి గర్వకారణమన్నారు. హెచ్‌ఎం శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాగులో హద్దు చూపని అధికారులు



మాట్లాడుతున్న జాన్కంపేట్ గ్రామస్తులు

వేల్పూర్: మండలంలోని జాన్కంపేట్, పచ్చలనడ్కుడ గ్రామాల మధ్య పెద్దవాగులో తమ గ్రామ సరిహద్దును చూయించాలని చాలా రోజులనుంచి కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని జాన్కంపేట్ గ్రామస్తులు ఆరోపించారు. వేల్పూర్‌లో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రతి సంవత్సరం వరద ప్రవాహానికి తమ వ్యవసాయభూములు కోతకు గురవుతూ వాగులో కలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ఎన్నో ఎకరాల భూములు వాగులో కలిసిపోయాయన్నారు. తమకు సరిహద్దు చూయించాలని అధికారులను కోరితే, పచ్చలనడ్కుడ గ్రామస్తులు అడ్డుకుంటున్నారని వాపోయారు. పంచాయితీరాజ్ చట్టం ప్రకారం రెండు గ్రామాల మధ్య వాగు ఉన్నా, ఒర్రె ఉన్నా రెండు గ్రామాలకు హక్కు ఉంటుందని ఇంతకు ముందున్న కలెక్టర్ నారాయణరెడ్డి రెండు గ్రామాల వారికి గత ఏడాది జనవరిలో ఆయన చాంబర్‌లో స్పష్టంగా చెప్పారన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు సర్వే నిర్వహించి, వాగులో జాన్కంపేట్ సరిహద్దు చూయించాలని వారు కోరారు. ఈ విషయమై తహసీల్దార్ నాగార్జునను వివరణ కోరగా.. రెండు గ్రామాల మధ్య వాగులో సరిహద్దును జిల్లా అధికారులు పరిష్కారించాల్సి ఉంటుందని, దీనికోసం గత నెల 18న జిల్లా సర్వే ఏడీకి నివేదించామన్నారు. మరోసారి విన్నవించి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు.

సొసైటీ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం



అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన డైరెక్టర్లు

- జాకోరా సహకార సంఘం నూతన చైర్మన్‌గా దశరథ్
- కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

వర్ని: మండలంలోని జాకోరా సహకార సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డిపై సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. జిల్లా సహకార అధికారి శ్రీనివాస్‌రావు సొసైటీ కార్యాలయంలో శనివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించారు. సొసైటీలో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా, అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా పది మంది చేతులెత్తారు. గతంలో కాంగ్రెస్‌కు నలుగురు, బీఆర్‌ఎస్‌కు తొమ్మిది మంది డైరెక్టర్లు ఉండగా, సిద్దాపూర్‌కు చెందిన డైరెక్టర్ దశరథ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. రాజకీయ సమీకరణలు మారిన నేపథ్యంలో దశరథ్ మరో నలుగురు బీఆర్‌ఎస్ సభ్యులను కలుపుకొని అవిశ్వాసానికి తెరలేపారు. చైర్మన్ కృష్ణారెడ్డిపై అవిశ్వాసం ప్రకటిస్తూ గత నెల 9న 9 మంది సభ్యులు సహకార కమిషనర్‌కు నోటీసును అందజేశారు.

డీసీసీబీ చైర్మన్‌కు ఎదురుదెబ్బ

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డికి ఎదురు దెబ్బ తగిలింది. తన సొంత నియోజకవర్గం పరిధిలోని జాకోరా సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గడం భాస్కర్‌రెడ్డికి ఎదురు దెబ్బ అని చెప్పొచ్చు.

నూతన చైర్మన్ దశరథ్

సిద్దాపూర్ గ్రామానికి చెందిన సొసైటీ డైరెక్టర్ బర్దావల్ దశరథ్ జాకోరా సొసైటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కృష్ణారెడ్డిపై అవిశ్వాసం నెగ్గిన తరువాత నూతన చైర్మన్ ఎన్నిక నిర్వహించగా, దశరథ్ నుంచి ఒకేఒక్క ప్రతిపాదన రావడంతో ఆయన ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసరావు ప్రకటించారు. అనంతరం ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్‌కు చెందిన దశరథ్ చైర్మన్‌గా ఎన్నికాకవడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నాయి. రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఎలమంచిలి శ్రీనివాసరావు, వర్ని సొసైటీ మాజీ చైర్మన్ వీర్రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్‌బాబా, రాష్ట్ర గిరిజన నాయకులు ప్రతాప్‌సింగ్, నాయకులు రాజిరెడ్డి, మాసాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నూతన చైర్మన్ దశరథ్‌కు ధ్రువీకరణపత్రాన్ని అందజేస్తున్న సహకార అధికారి శ్రీనివాసరావు

ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ నారాయణ

మాక్లూర్: వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని మానిక్‌బండార్ చౌరస్తాలోని కాకతీయ కళాశాలలో శనివారం అవగాహన సదస్సుకు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో మనం డ్రైవింగ్ సక్రమంగా చేస్తున్నామా? లేదా? అని కాకుండా ఎదుటివారి వాహనాన్ని దృష్టిలో పెట్టుకుని డ్రైవింగ్ చేయాలన్నారు. కొందరు అవగాహన లేక మద్యం సేవించి వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇచ్చి కుటుంబంలో దుఖాన్ని తెచ్చుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెల్వరాజ్, వైస్ ప్రిన్సిపల్ సాయిరెడ్డి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ల్యాబ్‌కు బేకరీ శాంపిళ్లు



ఆర్మూర్ టౌన్: పట్టణంలోని డాల్ఫిన్ బెంగళూరు బేకరీలో కేక్‌లు, తినుబండారాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తార్యానాయక్ శనివారం తనిఖీ చేశారు. కేక్‌లు, ఇతర ఆహార పదార్థాల శాంపిళ్లను సేకరించి పంచనామా నిర్వహించారు. శాంపిళ్లను హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. 15 రోజుల తరువాత వచ్చే ల్యాబ్‌రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

జీపీ పాలకవర్గాలకు ఘనసన్మానం



బోధన్: పదవీకాలం ముగిసిన నేపథ్యంలో సాలూర గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులను మండల కేంద్రంలోని రైతు వేదికలో పంచాయతీ ఉద్యోగ సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు, ఆయా కుల సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు శనివారం ఘనంగా సన్మానించారు.

తాజా మాజీ సర్పంచ్ భుయ్యాన్‌చంద్రకళ రాజప్పపటేల్‌తోపాటు వార్డు సభ్యులకు జ్ఞాపికలను అందజేశారు. తాజా మాజీ సర్పంచులు చంద్రకళ, శ్రీనివాస్‌రావు (సాలూర క్యాంప్), అమేర్ (ఫత్తేపూర్)తోపాటు సాలూర గ్రా మ వార్డు మెంబర్లను సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్ ఆధ్వర్యంలో సొసైటీ పాలకవర్గ సభ్యులు సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఐసీడీఎంఎస్ డైరెక్టర్ రాజాగౌడ్, పీఆర్టీయూ జిల్లా ప్రతినిధి ఇల్తె పు శంకర్, గ్రామపెద్దలు మైదపు నాగరాజు, ఇల్తెపు రమేశ్, బుద్దె లక్ష్మణ్, స్వామిగౌడ్, లింబయ్య, ఆ యా శాఖల ఉద్యోగులు, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జాతీయస్థాయికి ఎంపిక



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పిప్రి రోడ్డులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి జస్వంత్ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ దుర్గారెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయి అండర్–14 బాలుర విభాగంలో జస్వంత్ ప్రతిభ కనబ ర్చి జాతీయస్థాయికి ఎంపికయ్యాడన్నారు. ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నీలో పాల్గొంటున్నట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ సంధ్యారాణి, శ్రీధర్, వ్యాయామ ఉపాధ్యాయులు రాజేందర్, సంజీవ్ తదితరులు జస్వంత్‌ను అభినందించారు.

ప్రత్యేక పూజలు

ఎడపల్లి(బోధన్): శనివారం అష్టమి సందర్భంగా మండలంలోని జానకంపేట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ముందుగా అష్టముఖి కోనేరులో పుణ్యస్నానాలచరించి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఏర్పాట్లు చేశారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

వర్ని/పెర్కిట్(ఆర్మూర్): వర్ని మండలంలోని మల్లారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వైద్యులు శనివారం కంటి పరీక్షలు నిర్వహించారు. నలుగురికి సమస్య ఉన్నట్లు గుర్తించి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి సిఫారసు చేసినట్లు కంటి వైద్యుడు లక్ష్మీనర్సయ్య తెలిపారు. ఏఎన్‌ఎం లక్ష్మి, ఆశ కార్యకర్త రాధా పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి కృష్ణవేణి పాఠశాల విద్యార్థులకు ఎస్‌వీఎస్ విజన్ ఐ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ కర్తన్ విజయ్, ప్రిన్సిపల్ మహ్మద్ మీన్హాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఆర్మూర్‌టౌన్: శ్రీకృష్ణ అష్టాంగ యోగా శిక్షణకు సంబంధించిన కరపత్రాలను పట్టణంలోని మహాలక్ష్మి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో మున్సిపల్ కౌన్సిలర్ జీవీ నర్సింహారెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమవారం నుంచి 11 రోజులపాటు ఉచిత అష్టాంగ యోగా శిక్షణ ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 5 నుంచి 7గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు యోగా నిష్ణాతులైన కళింగ రాజు గురూజీ శిక్షణ ఇస్తారని తెలిపారు.

చట్టాలపై అవగాహన



బోధన్: శాంతిభద్రతలను పరిరక్షించే పోలీసుశాఖ అధికారులు, ఉద్యోగులకు చట్టాలపై అవగాహన ఉండాలని బోధన్ కోర్టు ఐదో జిల్లా అదనపు న్యాయమూర్తి ఏపీపీ శ్యాంరావు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏపీపీ డాక్టర్ సమ్మయ్య సూచించారు. రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని కోర్టులో డివిజన్ పరిధిలోని పోలీస్, అటవీ శాఖ అధికారులు, ఉద్యోగులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఏపీపీలు నేరపరిశోధన, చార్జిషీట్, సాక్షిదారుల చట్టాల వివరాలు, కోర్టులో వాటి అమలు తీరును వివరించారు. బోధన్ టౌన్ ఎస్సై పీటర్, పోలీస్ కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధిస్తే ప్రోత్సాహకాలు



రెంజల్(బోధన్): పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తామని లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి సభ్యులు ప్రకటించారు. మండలంలోని నీలా హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు సాయంత్రం సమయంలో అల్పాహారం అందించేందుకు ముందుకు వచ్చారు. హెచ్‌ఎం శంకర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అల్పాహారం అందించడంతోపాటు ప్రోత్సాహకాన్ని అందించేందుకు లయన్స్ సభ్యులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు సాంబిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, కిశోర్, చక్రవర్తి, గాంధీ, శ్రీనివాస్‌రాజు, స్థానికులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	హ్యాపీ ఎండింగ్ - 12.05, 6.20 బూట్‌కట్ బాలరాజు (తెలుగు) - 3.15 ధీర (తెలుగు) - 9.30
స్క్రీన్-2 –	హనుమాన్ (తెలుగు)-- 02.40, 6.00, 9.20
స్క్రీన్-3 –	అంబాజీపేట మ్యారేజీ బ్యాండు- 10.35, 1.30, 4.25, 7.20, 10.15
స్క్రీన్-4 –	ధీర (తెలుగు) - 01.20 కిస్మత్ (తెలుగు) - 4.00 గేమ్ ఆన్ (తెలుగు) - 6.50

సంక్షిప్తం

బోధన్‌లో మెగా వైద్య శిబిరం



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని అమృత ట్రూ లైఫ్ ఆస్పత్రిలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఏసీపీ కిరణ్‌కుమార్ హాజరై పరీక్షలు చేయించుకున్నారు. సీఐ వీరయ్య, వైద్యులు పాల్గొన్నారు.

నంబరు ప్లేటులేని వాహనాలు నడుపొద్దు

బాల్కొండ: నంబరు ప్లేట్లు లేని వాహనాలను నడుపొద్దని ముప్కాల్ ఎస్సై భాస్కరాచారి అన్నారు. మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేసి నంబర్ ప్లేట్లు లేని రెండు ద్విచక్రవాహనాలను సీజన్ చేశారు. వాహనదారులు హెల్మెట్లు ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.

వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేయత్నం

బోధన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయాన్ని కార్పొరేట్ సంస్థలకు కటబెట్టే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోందని తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడు ఎం.గంగాధర్ అప్ప ఆరోపించారు. ఈమేరకు శనివారం రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట సంఘం నాయకులు నిరసన తెలిపి, ఆర్డీవో డీఏవో విఠల్‌కు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ ఉత్పత్తులపై కార్పొరేట్ సంస్థలకు ఆధిపత్యం కల్పించే విధంగా వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించారని విమర్శించారు. రైతుల పంట రుణమాఫీతోపాటు శాస్త్రీయంగా పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. సంఘ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

మాక్లూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని తెలంగాణ విద్యార్థి పరిషత్ నగర అధ్యక్షుడు అఖిల్ ఆరోపించారు. మండలంలోని బోర్గం(కె) ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా ఎంఈవోలు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు మహేశ్, సుజిత్, మనోజ్ ఉన్నారు.

నరసింహస్వామి ఆలయానికి పాదయాత్ర



రుద్రూర్: మండల కేంద్రం నుంచి మహారాష్ట్రలోని శలగామ లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి భక్తులు శనివారం పాదయాత్రగా బయల్దేరారు. మండలకేంద్రంలోని నగరేశ్వర మందిరం వద్ద ప్రారంభమైన పాదయాత్ర కోటగిరి, పొతంగల్ మండలాల మీదుగా కొనసాగింది. ప్రముఖ వ్యాపారి బచ్చు రాము పర్యవేక్షణలో పాదయాత్రగా భక్తులు బయల్దేరారు. రుద్రూర్ మండలం నుంచి 35 మంది, పొతంగల్ మండలం నుంచి 15 మంది వెళ్లారు.